డైలీ న్యూస్ పేపర్ హంస కలం
మంగళవారం 03 - 02 - 2026

# బాలల రక్షణకోసం నిరంతర తనిఖీలు నిర్వహిస్తా జిల్లా ఎస్పీ

సూర్యాపేట టౌన్ **ఫిబ్రవరి 02 హంస కలం:** వెట్టిచాకిరి కి, నిరాదరణకు గురైన బాలబాలికలకు, తప్పిపోయి వచ్చిన బాలలను గుర్తించి సంరక్షించడం లో బాగంగా ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం అని ఎస్పి నరసింహ అన్నారు, జిల్లాలో జనవరి నెలలో నెలరోజుల పాటు జిల్లా పోలీసు, జిల్లా యంత్రాంగం, జిల్లా సంక్షేమం, బాలల రక్షణ, లేబర్, రెవెన్యూ, హెల్త్ మొదలగు డిపార్ట్మెంట్ ల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంను పగడ్బందిగా నిర్వహించామని తెలిపినారు. ఆపరేషన్ స్మైల్ పూర్తయిన సందర్భంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు సమావేశం నిర్వహించి స్మైల్ కార్యక్రమంలో బాగా పని చేసి ఎక్కువ పిల్లలను సంరక్షించడంలో కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిరాదరణకు, వెట్టిచాకిరీ గురవుతున్న 176 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు, సమరక్షులకు క్షేమంగా అప్పగించడం జరిగినదని అన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు 56 మంది బాలలు ఉండగా వీరిలో , 49 మంది బాలురు, 7 గురు బాలికలు ఉన్నారు, అలాగే ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 120 మంది బాలలు ఉండగా వీరిలో 80 మంది బాలురు, 40 మంది బాలికలు ఉన్నారు అని ఎస్పీ తెలిపినారు.






అధికారుల పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా రెస్క్యూ టీమ్స్ వివిధ ప్రదేశాల్లో వీరందరినీ గుర్తించి వీరికి రక్షణ కల్పించడం జరిగినది అన్నారు. ఆపరేషన్ స్మైల్ ఉద్దేశ్యాన్ని, లక్ష్యాన్ని చేరేలా సిబ్బంది అందరూ బాగా పని చేశారు, బాలకార్మిక వ్యవస్థ సమూలంగా నిర్మూలించి బాలల వికాసానికి ప్రతిఒక్కరూ తోడ్పడాలని అన్నారు. భాలల రక్షణలో పోలీసు తనిఖీలు నిరంతరంగా నిర్వహిస్తామని అన్నారు. బాలల వికాసానికి, బంగారు భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి అని కోరినారు. వెట్టిచాకిరి గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. రెస్క్యూ ఆపరేషన్స్ ద్వారా 176 మంది పిల్లలను గుర్తించడంలో బాగా పని చేసిన పోలీసు సిబ్బంది, జిల్లా బాల రక్షణ అధికారులను, వివిధ శాఖల సిబ్బంది అందరినీ అభినందిస్తున్నాను అని ఎస్పి తెలిపినారు.

చదువులతో మంచి భవిష్యత్తు ఉన్నది అనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలి, ప్రభుత్వాలు ఉచిత వసతి తో కూడిన విద్యను అందిస్తున్నాయి, పిల్లలను ఉన్నత చదువులు చదివించి వారికి బంగారు భవిష్యత్తును అందించాలి అని తల్లిదండ్రులకు ఎస్పి విజ్ఞప్తి చేశారు. అలవాటుగా ఇలాంటి నేరాలకు పాల్పడితే అలాంటివారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశం నందు అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిసిఆర్బి డీఎస్పి రవి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, పోలీస్ ఐటి అర్ఎస్ఐ రాజశేఖర్, చైల్డ్ సంరక్షణ అధికారులు రవి, నాగుల మీరా, స్మైల్ బృందం ఎస్ఐ మల్లేశం, ఏఎస్ఐ వెంకన్న, స్మైల్ టీమ్స్ సిబ్బంది ఉన్నారు.

# కేంద్ర బడ్జెట్ లో రాష్ట్ర కేటాయింపుల పై టీడీపీ నేతలు హర్షం



తిరుపతి సిటీ, **ఫిబ్రవరి 02 హంస కలం:** తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు కేంద్ర బడ్జెట్-2026 పై హర్షం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ ప్రాంత పురోగతికి ఎలా దోహదపడుతుందో వివరించి కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బడ్జెట్‌లో ఆశించిన రీతిలో ప్రాధాన్యత కల్పించిందని, ఇది రాష్ట్ర పునర్నిర్మాణానికి ఎంతగానో తోడ్పడుతుందని పార్టీ సభ్యులు పేర్కొన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధుల కేటాయింపు మరియు పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు కేంద్రం చూపుతున్న చొరవ హర్షణీయమన్నారు. కొప్పర్తి వంటి పారిశ్రామిక కారిడార్లకు మరియు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీల ద్వారా తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాలు పారిశ్రామికంగా ఎదిగే అవకాశం ఉందని, రైల్వే కనెక్టివిటీ, జాతీయ రహదారుల విస్తరణలో తిరుపతికి ప్రాధాన్యత దక్కిందన్నారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఈ బడ్జెట్ ఊతమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదాయపు పన్ను రాయితీలు మరియు వ్యవసాయ రంగంపై పెట్టిన పెట్టుబడులు సామాన్యులకు, రైతులకు ఎంతో మేలు చేకూరుస్తాయని దివాకర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ లో అధిక మొత్తంలో కేటాయింపులు ఓర్వలేక వైఎస్ఆర్సీపీ డైవర్షన్ రాజకీయాలు చేస్తుందని ఎద్దేవా చేశారు. లడ్డు కల్తీ వ్యవహారం, అంబటి రాంబాబు చంద్రబాబు పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దీనికి నిదర్శనం అన్నారు. ఆంధ్ర రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అభివృద్ధి వైపు పరుగుపెట్టిస్తుంటే చూసి ఓర్వలేక వైఎస్ఆర్సీపీ అనవసరమైన రాజకీయాలు చేస్తున్నారు అని ఎద్దేవ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో తుడా పరిధిని మరింత సుందరంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షరాలు పనబాక లక్ష్మి, గ్రీనరీ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సదాశివం, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు యశ్వంత్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్ సి ముని కృష్ణ, పూక విజయ కుమార్, జెబి శ్రీనివాసులు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పకడ్బందీ ప్రణాళిక ప్రకారం శివరాత్రికి వసతులు కల్పించాలి

సమన్వయంతో జాతర వేడుకలు విజయవంతం చేయాలి

మహా శివరాత్రి జాతర సమన్వయ సమావేశంలో జాతర కమిటీ చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమన్వయ సమావేశం





**ఫిబ్రవరి 02 హంస కలం:** వేములవాడ టౌన్: మహా శివరాత్రి జాతరకు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం ఆయా శాఖల అధికారులు వసతులు కల్పించాలని జాతర కమిటీ చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో మహా శివరాత్రి జాతర సందర్భంగా అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించగా, జాతర కమిటీ చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితే, ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతర కమిటీ చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి శ్రీ ఆలయం దాకా, వేములవాడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లలో మరమ్మత్తులు, నిర్మాణాలు, హెలిప్యాడ్ వద్ద, ఇతర చోట్ల బారికేడింగ్ పక్కా ప్రణాళిక పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ ఏడాది 600 బస్సులు ఏర్పాటు చేస్తామని, ఇంకా భక్తుల రద్దీకి అనుగుణంగా వాహనాలు అందుబాటులో పెడుతామని ఆర్టీసీ ఆర్ఎం తెలిపారు. జడ్పీ డిప్యూటీ సీఈఓ, వేములవాడ మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్తంగా ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు ఇతర చోట్ల మూడు షిఫ్టలో సిబ్బంది ఉండేలా చూడాలని ఆదేశించారు. జాతరకు ముందు నుంచి తరువాత మూడు రోజుల వరకు పారిశుధ్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో బస్సు స్టాండ్, పార్కింగ్ స్థలాలు, ఇతర చోట్ల పూర్తి వివరాలతో హెల్ప్ డెస్క్ లు సిబ్బంది అందుబాటులో పెట్టాలని, ప్రతి చోట అన్ని వివరాలతో కూడిన సైన్ బోర్డులు పెట్టించాలని తెలిపారు. ఆలయంలోని క్యూల వద్ద, పార్కింగ్ స్థలాల వద్ద, బస్సు స్టాండ్లలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని మిషన్ భగీరథ, ఆలయ అధికారులను ఆదేశించారు. భక్తులకు అల్పాహారం చక్కటి వాతావరణంలో కల్పించాలని సూచించారు. సెస్ అధికారులు భీమేశ్వర ఆలయం, బద్ది పోచమ్మ ఆలయం, ఇతర చోట్ల 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని, అధికారులు, సిబ్బంది ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో భీమన్న ఆలయం, ప్రసాదం కౌంటర్, పార్కింగ్ స్థలాలు ఇతర చోట్ల వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ లతో సిద్ధంగా ఉండాలని, వేములవాడ ఏరియా హాస్పిటల్, సిరిసిల్ల జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అగ్ని మాపక శాఖా అధికారులు ప్రధాన ఆలయాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు చెక్ చేయాలని, వారి సిబ్బంది గుడి ఆవరణలో జాతర సమయంలో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు భక్తులకు అందించే ప్రసాదం, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించాలని ఆదేశించారు. క్యూ లైన్లు, వీఐపీలు, కళ్యాణ కట్ట, ఇతర చోట్ల రద్దీ నియంత్రణ, దర్శనం పూర్తి చేసేందుకు జిల్లా స్థాయి అధికారులను నియమించామని, వారు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. నాంపల్లి వద్ద భక్తుల రద్దీ నియంత్రణ, ఏర్పాట్ల కల్పనకు ఇద్దరు అధికారులను నియమించామని వివరించారు. కోడెల నిర్వహణ, సంరక్షణ జిల్లా పశు సంవర్ధక శాఖ, ఆలయ అధికారులు సమన్వయంతో చూసుకోవాలని ఆదేశించారు. వేములవాడలో లాడ్జ లలో అద్దెలు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. జాతరలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగిం చకుండా చూడాలని, క్యూ లైన్ల వద్ద తాగునీటిని స్టీల్ గ్లాస్ లలో ఇవ్వాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు సహాయం కోసం వీల్ చైర్లు వాలంటీరను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి కావాల్సిన గదులు, ఆహారం, ఇతర సదుపాయాలు వేములవాడ ఆర్డీఓ, ఆలయ అధికారులు చూసుకోవాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎక్కడా దర్శనం, వసతులలో ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేసారు. వచ్చిన భక్తులు దర్శనం, క్షేమంగా వెళ్ళేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. జాతరకు సంబందించిన పనులన్నీ రానున్న వారం రోజుల్లో పూర్తి చేయాలని జాతర చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

**ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు**

ఎస్పీ మహేష్ బీ గితే మహా శివరాత్రి సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బీ గితే తెలిపారు. సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తూ భద్రత చర్యలు పర్యవేక్షిస్తామని వివరించారు. తిప్పాపూర్ బస్సు స్టాండ్, ఇతర బస్సు స్టాండ్, రద్దీ ప్రదేశాల్లో పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామివారికి ఏకాంత సేవలు, పూజలు కొనసాగుతాయని ఆలయ అర్చకుడు చంద్రగిరి శరత్ తెలిపారు. భీమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి జాతర, స్వామి వారికి పట్టు వస్త్రాల సమర్పణ టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అందిస్తారని వెల్లడించారు. సమావేశంలో ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓలు రాధాబాయి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# నిర్మల్ పోలీస్... మీ పోలీస్

బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

గ్రీవెన్స్ డే ద్వారా ప్రజా సమస్యలకు పారదర్శకంగా తక్షణ పరిష్కారం

జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్

నిర్మల్ **ఫిబ్రవరి 02 హంస కలం:** సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

**ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.....**

ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.





# అవకాశం ఇవ్వండి నాయకుడిగా కాదు మీ సేవకుడిగా ఉంటా

పిల్లలమర్రి మధుసూదన్ 19వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి

రిపోర్టర్ సింగం కృష్ణ,మునుగోడు ప్రతినిధి,**ఫిబ్రవరి 02 హంస కలం:** చౌటుప్పల్ మున్సిపాలిటీ 19 వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పిల్లలమర్రి మధుసూదన్ మున్సిపల్ ఎన్నికల బరిలోకి అడుగుపెట్టారు.ప్రజా జీవితంలోకి ఆయన ఇదే మొదటి అడుగు కాగా,తొలిసారి ప్రజల ముందుకు వచ్చి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.సమాజ సేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చానని పిల్లలమర్రి మధుసూదన్ అన్నారు.19 వ వార్డులో నెలకొన్న మౌలిక సమస్యలు,అభివృద్ధి అవసరాలను గుర్తించి,ప్రజల భాగస్వామ్యంతో పరిష్కార దిశగా పనిచేస్తానని చెప్పారు.ముఖ్యంగా తాగునీరు,డ్రైనేజీ,రోడ్లు,పారిశుద్ధ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు.తనపై నమ్మకంతో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అవకాశం కల్పించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 19వ వార్డు ప్రజలు తనను ఆదరించి ఆశీర్వదిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నన్ను తొలిసారి పరీక్షించే అవకాశం ప్రజలకు వచ్చింది.నిజాయితీగా పనిచేసే అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఆశీర్వదించాలి అని ప్రజలను కోరారు.

# ఆదివాసి బిడ్డలకు అభినందనల వెల్లువ

సన్మానం చేసిన మహాదేవపూర్ వార్డు సభ్యులు




**ఫిబ్రవరి 02 హంస కలం:** ఉపాధ్యాయ దంపతులను స సన్మానించిన వార్డ్ సబ్యులు మహాదేవ పూర్ గ్రామ జెడ్పిహెచ్ స్ గర్ల్స్ స్కూల్ ఉపాధ్యాయ దంపతులు పిడి గుర్సింగ పూర్ణిమ నాగేశ్వరావు మేడారం జాతర లో వారికి దొరికి నటువంటి బంగారు ఆభరణాలు (మూడు స్వర) తులాలు పుస్తేలతాడు సుమారు 6 .లక్షల విలువగల బంగారాన్ని తిరిగి పోగొట్టుకున్న వారికి ఇచ్చి వారి గొప్ప మనసును చాటుకున్నారు ఇందులో భాగంగా ఉపాధ్యాయ దంపతులను సన్మానించిన వార్డ్ సబ్యులు పడాల రాజమౌళి, గడ్డం స్వామి, చీర్లవంచ చంద్రశేఖర్, కొండపల్లి రాములు, మహ్మద్ బిన్ అలీ, ఎండి నయీం మరియూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి ఉపాధ్యాయులు మడక మధు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ కు వినతిపత్రం అందచేత

కాళేశ్వరం--అన్నారం మీదుగా చెన్నూరుకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించాలి.



**ఫిబ్రవరి 02 హంస కలం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం నుంచి పలుగుల, మద్దులపల్లి, చంద్రుపల్లి, అన్నారం మీదుగా చెన్నూరుకు ప్రతిరోజూ మూడు ట్రిప్పుల ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని ఆయా గ్రామాల సర్పంచులు కోరారు. ఈ మేరకు వారు మంచిర్యాల జిల్లా ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలతను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం అత్యంత అవసరమైందని, విద్యార్థులు, ఉద్యోగులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.దీనిపై అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత సానుకూలంగా స్పందిస్తూ, విషయాన్ని డిపో మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలుగుల సర్పంచి విజయలక్ష్మి, మద్దులపల్లి సర్పంచి సరిత, చంద్రుపల్లి సర్పంచి గురుసింగ బాపు, అన్నారం సర్పంచి ప్రభాకర్ పాల్గొన్నారు.

# తిరుపతి విమానాశ్రయంలో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌కు ఘనంగా వీడ్కోలు పలికిన తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి



రేణిగుంట, ఫిబ్రవరి 02: **ఫిబ్రవరి 02 హంస కలం:** తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ సతీష్ మహానా తిరుపతి విమానాశ్రయం నుండి యూపీ తిరుగు పయనమయ్యారు. యూపీ స్పీకర్‌కు తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా స్పీకర్ సతీష్ మహానా తిరుమల పర్యటన పట్ల హర్షం వ్యక్తం చేసి,తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డినీ అభినందించారు. తుడా చైర్మన్ యూపీ స్పీకర్ సతీశ్ మహానా కి తుడా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి మరియు తుడా ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మెగా 9 టీవీ ఆవిష్కరించిన టియుడబ్ల్యూజే ఐజేయు యూనియన్

మెగా 9 టీవి క్యాలెండర్ ఆవిష్కరించిన టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్.



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, **ఫిబ్రవరి 02 హంస కలం:** టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మెగా 9 టీవీ వారు ప్రజలకు వారధిగా నిలవాలని, ప్రజలకు ఉపయోగపడే విధంగా నిరంతరం అందుబాటులో ఉండాలని కోరారు. అనతి కాలంలోనే ప్రజలు మెగా9 టీవీ ని ఆదరించారని, భవిష్యత్తులో మరింత అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో మెగా 9 టీవీ మహబూబాబాద్ జర్నలిస్ట్ ఉమ్మగాని మధు, టి యు డబ్ల్యూ జే ఐ జే యు జిల్లాప్రధానకార్యదర్శి గాడిపెల్లి శ్రీహరి, జిల్లా నాయకులు గాడిపల్లి యాదగిరి, టీయూడబ్ల్యూజే హెచ్ 143 జిల్లా కోకన్వీనర్ శేఖర్, సీనియర్ జర్నలిస్ట్ లు కరుణాకర్, అశోక్, సుధాకర్, నాగరాజు, పూర్ణచందర్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మంతూర్ మల్లన్న సన్నిధిలో మహా జాతర.. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు



సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం **ఫిబ్రవరి 02 హంస కలం:** ఫిబ్రవరి 2 తేదీ మీ సుధాకర్ రిపోర్టర్ ఈ రోజు మంతూర్ గ్రామం లో ఈ నెల 15 వ తారీకు నాడు జరిగే మహా శివరాత్రి పండగ ను పెద్ద ఎత్తున్న మహా జాతర ను జరిపించే విదంగా అన్ని ఏర్పాట్లులలో భాగంగా భక్తులకు గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లు కలగకుండా ముందు జాగర్తగా గా సర్పంచ్ పర్వేజ్ గారు కాలువ ఇరిగేషన్ అధికారులతో మట్టి కోసం మాట్లాడి బస్టాండ్ నుండి మల్లన్న గుడి వరకు గుంతలు గుంతలు గా ఉన్న మట్టి రోడ్డు ను ఇరువైపులా మట్టిని పొయడం జరిగింది ఈ కార్యక్రమం లో గ్రామ ఉపసర్పంచ్ సంతోష్ భాగరెడ్డి. సెక్రటరీ మాషుమ్ అలీ గారు ఆలయ కమిటీ అధ్యక్షులు దయ్యాలా మహిపాల్ ఓలప్ సుక్కయ్య. నాని పాషా.సాయిరెడ్డి పడిగే సత్తయ్య.ఖలీల్. తొల్లా స్వామి తదితరులు పాల్గొన్నారు

# జిల్లా స్థాయి పరీక్షలో టాప్ దౌల్తాబాద్ బాయ్స్ హైస్కూల్‌కు గర్వకారణం




( తెలంగాణ గళం తెలుగు దినపత్రిక**ఫిబ్రవరి 02 హంస కలం:** సిద్దిపేట జిల్లా స్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్టులో దౌల్తాబాద్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థి కోనేరు వివేకానంద ప్రతిభను చాటుకున్నారు. 100 మార్కులకు గాను 70 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. ఈ ప్రతిభతో ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపిక కావడం గమనార్హం. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా శాఖ విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థి వివేకానందకు ప్రశంసా పత్రం మరియు మెమొంటో అందజేశారు. ఈ శుభ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చామకూర అనిల్ కుమార్ విద్యార్థి వివేకానందను అభినందించడంతో పాటు, అతని విజయంలో కీలక పాత్ర పోషించిన గైడ్ టీచర్లు సత్యనారాయణ , దశరథం,ల కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ విజయం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు గోపాల్ రెడ్డి, సంజీవ్, గోవర్ధన్ రెడ్డి, మహేష్ రెడ్డి, రవీందర్, మల్లేశం, విజయ కృష్ణ, హరికృష్ణ, మహేశ్వరి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ, అంబికా, స్టాఫ్ సభ్యులు మనోహర్, శివరాజ్, రాజు, చంద్రమౌళి తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజేతను అభినందించారు.

## మెగా ఫ్యామిలీలో డబుల్ జాయ్..



టాలీవుడ్ మెగా కుటుంబంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఉపాసన కొణిదెల దంపతులు కవలలకు తల్లిదండ్రులయ్యారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో ఉపాసన ఒక మగ శిశువుకు, ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చారు. ఈ శుభవార్తతో కొణిదెల కుటుంబం, కామినేని కుటుంబం ఆనందంలో మునిగిపోయాయి. మెగా అభిమానులు "డబుల్ జాయ్" అంటూ సంబరాలు జరుపుకుంటున్నారు. కవలల జననం అనంతరం రామ్ చరణ్ సోషల్ మీడియాలో చేసిన భావోద్వేగ ట్వీట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. మాకు ఒక పాప, ఒక బాబు పుట్టారని ఆనందంగా పంచుకుంటున్నాను. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండటం మా జీవితాన్ని అపారమైన కృతజ్ఞతతో నింపింది. మా జీవితంలో ఉన్న మహిళలే మా గొప్ప బలం. ప్రతి క్షణంలో మాకు అండగా నిలిచిన అభిమానులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక ధన్యవాదాలు" అంటూ ఆయన రాసిన మాటలు అభిమానుల హృదయాలను తాకాయి.

## అదిరిందయ్యా అనిల్!

### ఈసారి ఆ హీరోతో ఈ స్టార్ డైరెక్టర్ సినిమా ఉండనుందా?



అనిల్ రావిపూడి.. వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు ఈ యంగ్ డైరెక్టర్.. ప్రతి సంక్రాంతికి ఓ సినిమా దింపుతున్నాడు. వచ్చిన ప్రతిసారి విజయాన్ని అందుకుంటూ దూసుకుపోతున్నాడు. టాలీవుడ్ లో అపజయం ఎరుగని దర్శకుడిగా రాణిస్తున్న అనిల్ రావిపూడి ఇటీవల చిరంజీవితో మన శంకర వరప్రసాద్ గారు సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నాడు. గత ఏడాది వెంకటేష్ తో సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్ అందుకున్న అనిల్ రావిపూడి. ఈ సంక్రాంతికి మన శంకర వరప్రసాద్ గారు సినిమాతో మరో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు అనిల్. ఈ సినిమా విజయంతో అనిల్ పై ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. మన శంకర వరప్రసాద్ గారు సినిమా ఇప్పటికే కలెక్షన్స్ కుమ్మేస్తుంది. రూ. 400కోట్లకు పైగా వసూల్ చేసి రికార్డులు క్రియేట్ చేస్తుంది. ఇప్పటికీ సక్సెస్ ఫుల్ గా ఈ సినిమా దూసుకుపోతుంది. త్వరలోనే ఈ సినిమా ఓటీటీలోకి రానుంది. ఇక మన శంకర వరప్రసాద్ సినిమా తర్వాత అనిల్ ఎవరితో సినిమా చేస్తారు అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వెంకటేష్ తో అనిల్ మరోసారి సినిమా చేస్తున్నారని అంటున్నారు. అలాగే అనిల్ మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాజిల్ తో సినిమా చేస్తున్నాడని కూడా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతుంది. దాంతో అనిల్ క్రేజీ హీరోలను లైనప్ చేసి ఈసారి అదిరిపోయే యాక్షన్ థ్రిల్లర్ సినిమాను ప్లాన్ చేస్తున్నారు అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ లు షేర్ చేస్తున్నారు నెటిజన్స్. ఇదెక్కడి కాంబోరా దేవుడా..! అంటూ నెటిజన్స్ అనిల్ నెక్స్ట్ సినిమా పై పోస్ట్ లు షేర్ చేస్తున్నారు. ఈ వార్తల్లో నిజమెంత అన్నది తెలియదు కానీ.. నెట్టింట మాత్రం అభిమానులు రచ్చ రచ్చ చేస్తున్నారు. దీని పై త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. వచ్చే ఏడాది సంక్రాంతికి కొత్త సినిమాతో వస్తాను అని అనిల్ ఇప్పటికే చెప్పారు.




## విశ్వక్‌సేన్ 'ఫంకీ' నుంచి రొమాంటిక్ మెలోడి 'రట్టాటటావ్'.!

టాలీవుడ్ యువ నటుడు విశ్వక్‌సేన్, కాయదు లోహర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఫంకీ. ఈ సినిమాకు కేవీ అనుదీప్ దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ చిత్రం వాలంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్ షురూ చేసింది చిత్రయూనిట్. ఇందులో భాగంగానే సినిమా నుంచి సెకండ్ సింగిల్ రాట్టటాటవ్ (=ఘ్ఘ్ఘుఝ) అనే సాంగ్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చింది. ఈ పాటకు దేవ్ పవర్ సాహిత్యం అందించగా.. రామ్ మిరియాల పాడాడు. భీమ్స్ సిసిరిలియో సంగీతం అందించాడు. కామెడీ నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో వీకే నరేష్, వీటీవీ గణేష్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## తెలుగు ఇండస్ట్రీలో కొత్త హీరోయిన్ల ఎంట్రీ

తెలుగు చిత్ర పరిశ్రమ రాబోయే కొన్నేళ్ల పాటు హీరోయిన్ల కొరత లేకుండా కళకళలాడనుంది. ముఖ్యంగా 2026 నాటికి అనేకమంది కొత్త నాయికలు టాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారు. వీరంతా స్టార్ హీరోల సినిమాలతోనే పరిచయం అవుతుండటంతో విడుదలకు ముందే వారి పేర్లు చర్చనీయాంశమవుతున్నాయి. వైజయంతి మూవీస్ బ్యానర్ మహేష్ బాబు అన్న రమేష్ బాబు కుమారుడు జయకృష్ణను హీరోగా పరిచయం చేస్తున్న శ్రీనివాస మంగాపురం సినిమాతో రషా థడానీ హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. ఉయ్యమ్మ పాటతో ఈమె ఇప్పటికే గుర్తింపు పొందారు. వైజయంతి మూవీస్, గీతా ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఆకాశంలో ఒక తార చిత్రంలో దుల్కర్ సల్మాన్ సరసన సాత్విక వీరవల్లి నటిస్తున్నారు. ఈ చిత్రానికి పవన్ సాదినేని దర్శకత్వం వహిస్తున్నారు.





## హిట్ కోసం విజయ్ దేవరకొండ ప్రయత్నాలు.. ప్రత్యేక పాత్రలలో సీనియర్ యాక్టర్స్

యూత్‌లో ప్రత్యేక ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కెరీర్‌లో మరో కీలక మలుపు చోటు చేసుకోనుంది. గత కొంతకాలంగా సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన, తాజాగా వరుస ప్రాజెక్టులతో బిజీ అవుతూ కొత్త స్ట్రాటజీని అమలు చేస్తున్నాడు. ఇటీవల విడుదలైన 'కింగ్‌డమ్' ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, ఇప్పుడు మరింత జాగ్రత్తగా కథల ఎంపికలో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో దర్శకుడు రవికిరణ్ కోలా తెరకెక్కిస్తున్న 'రౌడీ జనార్దన్' సినిమా ప్రత్యేకంగా నిలుస్తోంది. గ్రామీణ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం విజయ్ కెరీర్‌లో విభిన్నమైన ప్రయత్నంగా భావిస్తున్నారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో చూపించిన మాస్ ఎలిమెంట్స్, గ్రామీణ వాతావరణం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో పాటు బలమైన టెక్నికల్ టీమ్ పనిచేస్తుండటం విశేషం. హీరోయిన్‌గా కీర్తి సురేష్ ఎంపిక కావడం సినిమాకు అదనపు ఆకర్షణగా మారింది. నటీనటుల ఎంపిక విషయంలో దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం.ఇక కథలో భావోద్వేగాలకు కీలకమైన పాత్రల కోసం అనుభవజ్ఞులైన నటులను తీసుకుంటున్నట్లు టాక్ వినిపిస్తోంది. సీనియర్ నటి శోభన ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారన్న వార్త సినిమాకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. అలాగే సీనియర్ హీరో రాజశేఖర్ కూడా ప్రత్యేక పాత్రలో కనిపించే అవకాశాలున్నట్లు చర్చ నడుస్తోంది. భారీ తారాగణం, గ్రామీణ శైలిలో సాగే యాక్షన్ కథాంశం, పీరియాడిక్ టచ్ అన్నీ కలిసి 'రౌడీ జనార్దన్'ను విజయ్ దేవరకొండకు మాస్ కమ్బ్యాక్ మూవీగా నిలబెడతాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.